జగనన్నతో ఆరోగ్యం సురక్షితం


ఉండి: అర్తమూరులో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


కాళ్ల: పెద అమిరంలో డాక్టర్ సునీల్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు


పాలకోడేరు: పెన్నాడలో వైద్య శిబిరాన్ని తనిఖీ చేస్తున్న భీమవరం ఆర్డీవో కె.శ్రీనివాసులురాజు

ఉండి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల్లో రాష్ట్ర ప్రజల ఆరోగ్యం సురక్షితంగా ఉంటుందని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. బుధవారం మండలంలోని అర్తమూరులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. జనరల్ ఫిజీషియన్, పీడియాట్రిక్, ఆర్థోపెడిక్, కార్డియాలజీ విభాగాలకు చెందిన వైద్య నిపుణులు సేవలందించారు. ఈ సందర్భంగా స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు మాట్లాడుతూ ప్రజలిచ్చిన బాధ్యతను ఎంతో గొప్పగా జగనన్న నిర్వర్తిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ పి.ధర్మతేజ్, డాక్టర్ కీర్తన, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు గొనబోయిన దాసు, జేఏఎస్ మండల కన్వీనర్ బి.రామకృష్ణ, పార్టీ నాయకులు గానుబోయిన వెంకటేశ్వరరావు, జొన్నలగడ్డ వజ్రం, నిమ్మల రాజేశ్వరి, గృహసారథులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఇచ్చే ఆరోగ్య కానుక

కాళ్ల: ప్రతి పేదవాడికి జగనన్న ఇచ్చే ఆరోగ్య కానుక జగనన్న ఆరోగ్య సురక్ష అని జెడ్పీటీసీ పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, ఎంపీపీ పెనుమత్స విశ్వనాథరాజు అన్నారు. బుధవారం పెద అమిరం గ్రామంలో సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు ఆధ్వర్యాన వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు పరీక్షలు చేసి ఉచితంగా మందుల అందజేశారు. కోపల్లె సొసైటీ అధ్యక్షుడు వేగేశ్న జయరామకృష్ణంరాజు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం ఏనాడైనా ఇలా ప్రజలకు వైద్య సేవలు అందించారా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. సంక్షేమ పథకాలతో పాటు ప్రజల ఆరోగ్యానికి భద్రతనిస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో పీవీఎల్ నర్సింహరాజు ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరు, ప్రజల యోగాక్షేమాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారని చెప్పారు. కానీ నియోజకవర్గ ఎమ్మెల్యే ఏనాడైనా గ్రామాల్లో పర్యటించారా అని ప్రశ్నించారు. ఎన్నికలు దగ్గర పడటంతో గ్రామాల్లో తిరుగుతూ కంచాలు, చీరలు పంచి ప్రజలను మోసం చేసేందుకు తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో పీవీఎల్ నర్సింహరాజును గెలిపించుకుని రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నిలబెట్టుకోవాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా పెద అమిరం గ్రామానికి చెందిన వైద్యులు సరాబు సునీల్‌ను గ్రామ పెద్దల సమక్షంలో ఘనంగా సత్కరించారు. అంగన్వాడీలు తయారు చేసిన పౌష్టికాహారాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జవ్వాడి సత్యనారాయణ, సరాబు ముఖేష్, ఉప సర్పంచ్ జవ్వాది కిషోర్, కాటిక ఆనంద్ రాజ్, సుబ్బరాజు, సంసోన్, గ్రామ పెద్దలు, వైద్యులు, అంగన్వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలే కాదు..
ఆహారపు అలవాట్లను వివరించాలి

పాలకోడేరు: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో ఆరోగ్య పరీక్షలే కాకుండా మంచి ఆహారపు అలవాట్లను కూడా వివరించాలని భీమవరం ఆర్డీవో కె.శ్రీనివాసులు రాజు సూచించారు. బుధవారం పెన్నాడలో జరిగిన ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో మాట్లాడారు. అనంతరం ఎంపీడీవో నూకల మురళీ గంగాధర్ రావును శిబిరంలో వైద్య పరీక్షల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్డీవో మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందించేలా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వైద్య శిబిరానికి వచ్చే ప్రతి ఒక్కరికీ పరీక్షలను జాగ్రత్తగా చేసి వారికి అవసరమైన మందులను ఉచితంగా అందించడమే కాకుండా అవసరమైన వారికి స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చిల్లా అనూష, తహసీల్దార్ షేక్ హుస్సేన్, ఆర్ఐ ఎం.నాగభూషణం రావు, పీహెచ్‌సీ వైద్యాధికారి చినమిల్లి రంగం నాయుడు, పంచాయతీ కార్యదర్శి కె.లక్ష్మి, వైస్ ఎంపీపీ ఆదాడ లక్ష్మీతులసి, వార్డు సభ్యురాలు ఆదాడ ఉమామహేశ్వరి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గంగమ్మ ఒడికి దుర్గమ్మ


ఆకివీడు: వనువులమ్మ ఊరేగింపును ప్రారంభిస్తున్న నగర పంచాయతీ చైర్‌పర్సన్


భీమవరం (ప్రకాశంచౌక్): మెంటేవారి తోటలో అమ్మవారి గ్రామోత్సవం


కాళ్ల: దొడ్డనపూడిలో అమ్మవారి ఊరేగింపు


ఉండి: శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు


పాలకోడేరు: కొత్తపేటలో గ్రామోత్సవం

ఆకివీడు: శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం పలు చోట్ల అమ్మవారి ఊరేగింపు, నిమజ్జన కార్యక్రమాలు కొనసాగాయి. అమ్మవార్ల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ట్రాక్టర్లపై అమ్మవార్లను ఉంచి గరగ నృత్యాలు, శక్తి వేషాలు, డప్పులు, సన్నాయి, మేళతాళాలు, తీన్‌మార్‌తో ఊరేగింపు కొనసాగింది. స్థానిక జవహర్‌పేటలోని కనకదుర్గమ్మ, గంగానమ్మకోడులోని అమ్మవారు, రాజరాజేశ్వరి సహిత మార్కండేశ్వరస్వామి ఆలయంలోని అమ్మవార్లను పట్టణంలో ఊరేగించారు. అనంతరం అమ్మవార్ల విగ్రహాలను స్థానిక వెంకయ్య వయ్యేరు పంట కాల్వలో నిమజ్జనం చేశారు. స్థానిక వనువులమ్మ అమ్మవారి ఊరేగింపును నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి ప్రారంభించారు. కార్యక్రమంలో తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ జగ్గురోతు విజయ్ కుమార్, ఏఎంసీ చైర్మన్ ఎస్కే రసూల్ బీబీ, దేవస్థానం చైర్మన్ పొన్నాల నాగమణి, ఎస్కే హుస్సేన్, సుబ్బారావు, అగ్నికుల క్షత్రియ యువజన సంఘం అధ్యక్షుడు నాగరాజు, సభ్యులు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

బాల త్రిపుర సుందరీ దేవి గ్రామోత్సవం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం మెంటేవారి తోటలోని శ్రీ విజయ కనకదుర్గా శ్రీ చక్ర సహిత బాల త్రిపుర సుందరీ దేవి అమ్మవారి శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రంధి రవితేజ గ్రామోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామోత్సవాలతో పట్టణాలు, గ్రామాల్లో శాంతి నెలకొంటుందని, దైవ కార్యక్రమాల్లో యువత ఎక్కువగా పాల్గొనడం శుభపరిణామమని అన్నారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేక వాహనంలో ఊరేగించారు. అర్చకుడు కొమ్ము శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దొడ్డనపూడిలో అమ్మవారి ఊరేగింపు

కాళ్ల: శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల ముగింపులో భాగంగా అమ్మవారి ఊరేగింపు బుధవారం ఘనంగా నిర్వహించారు. దొడ్డనపూడి గ్రామంలో వేంచేసియున్న రాజరాజేశ్వరి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారిని భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా ఊరేగించారు. మేళతాళాలు, విచిత్ర వేషధారణలతో అమ్మవారి ఊరేగింపు గ్రామ పుర వీధుల గుండా సాగింది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు వీధుల్లో బారులు తీరారు. అయ్యప్ప మాలధారులు, గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ ఊరేగింపు

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని దొంగపిండి గ్రామంలో కొలువైయున్న శ్రీ కనకదుర్గమ్మను వైభవంగా ఊరేగించారు. మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, బాణ సంచాతో అమ్మవారిని గ్రామ పురవీధులు గుండా ఊరేగించారు. అమ్మవారి గరగలకు భక్తులు పూజలు చేసి ఆశీస్సులు పొందారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

లోసరిలో అఖండ అన్నసమారాధన

లోసరి గ్రామంలోని శ్రీ కోదండ రామాలయంలో శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అఖండ అన్నసమారాధన నిర్వహించారు. వివిధ వంటకాలతో కనకదుర్గమ్మకు నైవేద్యం సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి ప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

వైభవంగా శోభాయాత్ర

ఉండి: దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా ఉండి పడవల రేవులో వేంచేసియున్న కనకదుర్గమ్మ శోభాయాత్రను భక్తులు వైభవంగా నిర్వహించారు. అమ్మవారి 10వ వార్షిక మహోత్సవాల్లో భాగంగా బుధవారం తీన్‌మార్, డీజే సౌండ్స్‌తో జరిగిన యాత్రలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో భక్తులు అమ్మవారికి స్వాగతం పలికి దర్శించుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు, గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

పాలకోడేరులో..

పాలకోడేరు: పాలకోడేరు గ్రామం మోగల్లు రోడ్డు కొత్తపేటలో వేంచేసియున్న జగన్మాత శ్రీ విజయ కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద శ్రీ దేవీ శరన్నవరాత్రులు దసరా ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు నిట్టా ధర్మేంద్ర ఫణి శర్మ మాట్లాడుతూ దసరా ఉత్సవాలు పురస్కరించుకుని అమ్మవారికి లోక కల్యాణార్థం విశేష అభిషేకాలు, శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం అనంతరం ఊరేగింపు, నిమజ్జన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 27న ఆలయ ప్రాంగణంలో అఖండ అన్నసమారాధన చేపట్టనున్నారు.

పారదర్శకంగా ప్రభుత్వ పాలన

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్


సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం (ప్రకాశంచౌక్): రాష్ట్రంలో ప్రజలకు నీతివంతమైన పారదర్శక పాలన అందిస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం పట్టణంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తొలుత రూ.19.40 లక్షలతో 18వ వార్డులోని శ్రీ కామాక్షమ్మ గుడి రోడ్డు శ్రీనివాస సెంటర్ నుంచి మున్సిపల్ కాంప్లెక్స్ వరకు నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. అనంతరం 21వ వార్డులో రూ.21 లక్షలతో నిర్మించే కోస్టల్ బ్యాంకు నుంచి గవర్నమెంట్ హాస్పిటల్ ఫుట్ బ్రిడ్జ్ వరకు సీసీ డ్రెయిన్, ఆర్సీసీ కల్వర్ట్ పనులకు శంకుస్థాపన చేశారు. తర్వాత రూ.20.50 లక్షలతో కొత్తగా నిర్మించిన త్యాగరాజు భవనం సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన 4 ఏళ్లల్లో భీమవరం పట్టణంలో కోట్లాది రూపాయలు ఖర్చుచేసి పెద్ద ఎత్తున సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందిందని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, కోడే యుగంధర్ విజయలక్ష్మి, తోట భోగయ్య, ఏఎస్ రాజు, కందికట్ల ఎడ్వర్డ్, గంటా సుందర్‌కుమార్, నందమూరి ఆంజనేయులు, పాలపర్తి జోనా, మానేపల్లి నాగన్నబాబు, పేరిచర్ల సత్యనారాయణ రాజు, జంగం మాణిక్యాలరావు, గుంటి ప్రభు, గూడూరి రాధాకృష్ణ, మాదాసు రంగబాబు, కుప్పిలి వరం, షేక్ అన్సారీ, చెల్లబోయిన సూర్యప్రకాష్, ఎండీ కరిముల్లా బాషా, కోమటి రాంబాబు, కొట్టి కుటుంబరావు, మున్సిపల్ డీఈ త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.

మిల్లులు చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు

తాడేపల్లిగూడెం రూరల్: రైతులు ధాన్యం విక్రయానికి రైస్ మిల్లుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆర్బీకే ఇన్‌చార్జీలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, రైస్ మిల్లుల ప్రతినిధులతో సమన్వయ కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు మాట్లాడారు. తాడేపల్లిగూడెం ఆర్డీవో కే.చెన్నయ్య మాట్లాడుతూ ధాన్యంలో తేమ శాతం చూసే యంత్రాలు సక్రమంగా పనిచేసేలా చూడాలన్నారు. తేమ శాతం విషయంలో రైస్ మిల్లర్లు రైతులను ఇబ్బందులు పెడితే సీజ్ చేసి, రెండేళ్ల పాటు ధాన్యం కొనుగోలు ప్రక్రియకు దూరంగా పెడతామని హెచ్చరించారు. ధాన్యం కొనుగోలు సిబ్బంది సమన్వయం చేసుకుని ఆర్బీకేల్లో అన్ని పరికరాలు ఉండేలా చూడాలన్నారు. ధాన్యం రవాణాకు ఎవరైనా సొంత వాహనాలను వినియోగించాలంటే ఆర్బీకే సిబ్బందిని, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్‌ను సంప్రదించాలన్నారు. జీపీఎస్ పరికరాన్ని అమర్చుకుని ప్రొక్యూర్‌మెంట్ స్థలంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కాగా, రైస్ మిల్లు ప్రతినిధులు సమావేశానికి హాజరు కాకపోవడంతో ఆర్డీవో చెన్నయ్య అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ఏడీ మురళీకృష్ణ, పెంటపాడు తహసీల్దార్ శేషగిరిరావు, గూడెం మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

తణుకు పట్టణ సీఐగా నాగరాజు బాధ్యతల స్వీకరణ


సీఐగా బాధ్యతలు స్వీకరించిన నాగరాజు

తణుకు: తణుకు పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎం.నాగరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు, మల్కిపురం పోలీసు స్టేషన్లలో ఎస్సైగా పని చేసిన నాగరాజు ఇటీవల కాలంలో సీఐగా పదోన్నతి పొందిన ఆయన తణుకు పట్టణంలో బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు భీమవరంలోని జిల్లా ఎస్పీ రవిప్రకాష్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆయన స్థానంలో ఇక్కడ పని చేసిన ముత్యాల సత్యనారాయణ రెండు నెలల క్రితమే బదిలీపై విజయవాడ వెళ్లారు. నూతన సీఐ నాగరాజును తణుకు పట్టణ ఎస్సైలు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

నేడు తణుకులో ఉచిత మెగా వైద్యశిబిరం

తణుకు: పట్టణంలోని పాత పోస్టుఆఫీసు వీధిలోని జేకే ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే ఈ శిబిరంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ దేవరకొండ అశోక్‌కుమార్ పాల్గొని వైద్యపరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. ఉచిత బీపీ, సుగర్ పరీక్షలతో పాటు ఉచితం ఈసీజీ పరీక్షలు చేస్తారని వెల్లడించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

క్లుప్తంగా

నేడు భీమవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష


ఎం.శ్యామల, మున్సిపల్ కమిషనర్

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలో 24, 3, 14 వార్డుల్లో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల తెలిపారు. ఇప్పటి వరకు పట్టణంలో 26 జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ శిబిరాల్లో 9,365 మందికి వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. పట్టణంలో 85 శాతం సురక్ష సర్వే పూర్తి అయిందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని ఆమె కోరారు.

ప్రతి పౌరుడు పోలీసులా ఉండాలి


మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

సాక్షి, భీమవరం: ప్రజలకు ఆపద సమయంలో వెనకడుగు వేయకుండా పోరాటం చేసేది సైనికులు, పోలీసులేనని భీమవరం టూటౌన్ సీఐ జి.శ్రీనివాస్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక డీఎన్నార్ కళాశాలలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు మాట్లాడుతూ ప్రతి పౌరుడు పోలీసులా ఉన్నప్పుడే శాంతిభద్రతలు పరిరక్షించుకోగలమన్నారు. అనంతరం విద్యార్థులకు మహిళలపై అత్యాచారాలు, లైంగిక వేధింపులు అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శాంతకుమారి, చెరుకువాడ రంగసాయి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ అనిల్ దేవ్, ఏవో పి.రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆర్టీసీ డోర్ డెలివరీ ప్రచార మాసోత్సవాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాష్ట్రవ్యాప్తంగా ఏపీ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వారిచే 26వ తేదీ గురువారం నుంచి వచ్చే నెల 25 వరకు డోర్ డెలివరీ ప్రచార మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డీఎం యేలూరి సత్యనారాయణ మూర్తి తెలిపారు. డోర్ డెలివరీ కొరియర్/పార్శిల్ వివరాలపై వినియోగదారులకు అవగాహన కల్పించనున్నారు. డోర్ డెలివరీ బుక్కింగ్ చేసుకున్న వారికి వారాంతపు లక్కీడ్రా తీసి మాసోత్సవాల్లో బహుమతులు అందజేయనున్నారు. ఆర్టీసీ కార్గో సేవల్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన ఉచిత గుండె వైద్య శిబిరం

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం లయన్స్‌క్లబ్, స్థానిక జనతా చారిటబుల్ ట్రస్ట్ వారి పర్యవేక్షణలో దాత ఈతకోట తాతాజీ సహకారంతో కామినేని హాస్పటల్ విజయవాడ వారిచే ఉచిత గుండె వైద్య శిబిరం ఈ నెల 27వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 21వ వార్డు కొబ్బరితోట, బృందావనం లాడ్జి వెనుక నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు వంగపండు రామమోహన్‌రావు, కార్యదర్శి జగదీష్, కోశాధికారి హరిబాబులు వెల్లడించారు. ఆధునిక పరికరాలతో ఈసీజీ, ఈసీహెచ్ఓ వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తారని, అవసరమైన వారికి మందులు ఇస్తారని తెలిపారు. ఈ సౌకర్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శెట్టిబలిజలు ఐక్యంగా ఉండాలి

ఇరగవరం: మండలంలోని రేలంగి గ్రామంలో బుధవారం శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం జరిగింది. తణుకు, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల వారిగా మండల కమిటిలను ప్రకటించడం జరిగింది. అనంతరం నాయకులు మాట్లాడుతూ శెట్టిబలిజలు అందరు ఐక్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో శెట్టిబలిజ సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు దొమ్మేటి సుధాకర్, జెడ్పీటీసీ పంపన అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

ముదునూరుపాడులో ముగిసిన కూటములు

పెంటపాడు: దేవుని పరిశుద్ధాత్మశక్తి ద్వారానే స్వస్థత, రక్షణ సాధ్యమని బైబిల్ మిషను అధ్యక్షుడు డాక్టర్ పి. సజీవరావు పేర్కొన్నారు. ముదునూరుపాడు స్వస్థత శాలలో బైబిల్ మిషను ఉపాధ్యక్షుడు అద్దంకి దైవారావు ఆధ్వర్యంలో గత మూడు రోజుల నుంచి జరుగుతున్న పరిశుద్ధాత్మ కుమ్మరింపు కూటాలు బుధవారంతో ముగిసాయి. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి. సజీవరావు దేవుని వాక్యం బోధించారు. ఏసుక్రీస్తు ప్రభుని ఆద్యాత్మిక శక్తిని పొందేందుకు భక్తులు నిరంతరం ప్రార్థనలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మిషను సంఘ అధికారులతో పాటు, పలువురు దైవసేవకులు మూడురోజుల పాటు పరిశుద్ధాత్మతో కూడిన పలు సందేశాలు బోధించారు. ఈ కార్యక్రమంలో అద్దంకి జయకవిత, ప్రిన్స్‌జాన్‌వినయ్, ముదునూరుపాడు, జంగారెడ్డిగూడెం ప్రాంతాలకు చెందిన సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ పోటీల్లో బంగారు పతకాలు

సాక్షి, భీమవరం: రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలు అండర్-23 ఫాయిల్ విభాగంలో భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎం.వెంకటేష్ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించగా, ఎం.సుభాష్ చంద్రకుమార్ ఫాయిల్ విభాగం టీం ఈవెంట్‌లో స్వర్ణ పతకం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు చెప్పారు. బుధవారం పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఇరువురు విద్యార్థులూ కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచి డిసెంబర్‌లో పంజాబ్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అలాగే మరో విద్యార్థి లీలాకృష్ణ సబ్రి విభాగంలో సిల్వర్ మెడల్ సాధించాడన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఏవీ సుబ్బరాజు, డీఎస్పీ బండారు శ్రీనాథ్, కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంత్ వర్మ, డైరెక్టర్ ఎం.జగపతిరాజు, ఉపాధ్యక్షుడు సాగి విఠల్ రంగరాజు, కోచ్ జి.కృష్ణమోహన్, పీడీ పి.సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

వాసవి మాతకు పూలంగి సేవ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని ఏలూరురోడ్డులో వేంచేసియున్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ అమ్మవారికి బుధవారం ఆలయంలో అభిషేకాలు, పూలంగి సేవ, తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 మంది సుహాసినీలచే 108 రజత కలశములతో, పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో విశేష పూజలు జరిగాయి. హోమాలు, అనంతరం 5 వేల మందికి అన్నదానం చేశారు. అనంతరం పండిత సత్కారాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రీకృష్ణపరమాత్మకు పంచామృతాలతో అభిషేకాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని రామచంద్రరావుపేట శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరంలో బుధవారం శ్రీకృష్ణపరమాత్మకు పంచామృత అభిషేకాలు, స్వామివారికి నూతన పట్టు వస్త్రధారణ జరిగింది. అర్చకులు మంగిపూడి సీతారామయ్యచే విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమాలను మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ

తణుకు: పట్టణంలోని స్థానిక జాతీయ రహదారి ఆనుకుని వేంచేసిన శ్రీ ధర్మశాస్త్ర పంచాయతన అయ్యప్ప స్వామి దేవాలయంలో బుధవారం రాత్రి అయ్యప్ప పడి పూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురుస్వామి చలపతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజాకార్యక్రమంలో నిత్య పూజారి సత్యనారాయణ, బాబీ, వెంకట్‌లతో పాటు పెద్ద సంఖ్యలో అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.